క్లుప్తంగా

ఓటరు నమోదు తప్పులు లేకుండా చేయాలి

వీరులపాడు: బీఎల్‌వోలు ఓటరు నమోదు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ అన్నారు. మండలంలోని అల్లూరు, జుజ్జూరు గ్రామాల్లో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకనుగుణంగా ఓటరు నమోదు, మార్పులు ప్రక్రియ నిర్వహించాలన్నారు. ముఖ్యంగా మృతి చెందిన వారి ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి తొలగించాలని సూచించారు. మార్పులు, చేర్పులకు సంబంధించి వివరాలను నమోదు చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించటంతో పా టు తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల ని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న పశువులు పట్టివేత

కంచికచర్ల: పాడి పశువులను, ఆవులను కబేళాకు తరలిస్తే కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఎస్‌ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం కోదాడ నుంచి నూజివీడులో కబేళాకు అక్రమంగా తరలిస్తున్న నాలుగు గేదెలను మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద శనివారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా పశువులు, ఆవులను కబేళాకు తరలించరాదని లేకపోతే ఆ పశువులను తరలిస్తున్న వాహనంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుంటామన్నారు. పట్టుకున్న పశువులను నందిగామ గోశాలకు తరలించామని, అక్రమంగా పశువులను తరలిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అన్నారు.

మైనర్ కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో నివసిస్తున్న మైనర్ కనిపించడం లేదని నున్న పోలీసుస్టేషన్లో ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాంబే కాలనీకి చెందిన సూదాబత్తుల వంశీ బావ కుమారుడు ఇనగిరి సత్యసిద్ధార్థ (గుడివాడ) వాంబేకాలనీలో ఉంటూ పటమట హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 11వ తేదీన కోడిగుడ్లు తీసుకురావడానికి బయటకు వెళ్లిన సిద్ధార్థ తిరిగి రాలేదు. ఘటనపై వంశీ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన మహిళ అమ్మవారి గుడిలో పని చేస్తోంది. ఆమె భర్త ఏడేళ్ల క్రితం మరణించాడు. మూడేళ్ల క్రితం ఇంటి పక్కనే ఉంటున్న చింతపల్లి చంద్రశేఖర్‌తో పరిచయం ఏర్పడింది. కొంత కాలం నుంచి ఆమె చంద్రశేఖర్‌తో మాట్లాడటం లేదు. దీంతో అతను ఇంటికి రావడం, ఆమె ఎక్కడికి వెళితే అక్కడి వెళ్లి వేధిస్తున్నాడు. తన ఇంటికి రావద్దని చెప్పినా వినకుండా ఆమెను మానసికంగా వేధిస్తున్నాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి ఆమెను నానా దుర్భాషలాడడమే కాకుండా దాడికి యత్నించాడు. దీంతో ఆమె భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చంద్రశేఖర్‌తో తనకు, తన పిల్లలకు రక్షణ లేదని, అతని నుంచి రక్షించాలని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ కట్టడం కూల్చివేతపై రాద్ధాంతం


మున్సిపల్ అధికారులు కూల్చివేస్తున్న కట్టడం


ముందుజాగ్రత్తగా భారీగా మోహరించిన పోలీసులు

నందిగామ: ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు కూల్చి వేయడంపై నందిగామ పట్టణంలో వివాదం నెలకొంది. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం ... పట్టణ శివారు డీవీఆర్ కాలనీ ప్రాంతంలో పలు సర్వే నంబర్లలో 1.40 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ స్థలంలో కాలనీకి చెందిన కొందరు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఏర్పాటు చేసేందుకు నిర్మాణం చేపట్టారు. ఈ తరుణంలో మున్సిపల్ అధికారులు శుక్రవారం సాయంత్రం నిర్మాణాన్ని జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ నేపథ్యంలో స్థానికులకు, పోలీసులకు మధ్య వివాదం నెలకొంది. ఇదిలా ఉండగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన, సీపీఎంలు హిందూ దేవాలయాలను పడగొడతారా అంటూ నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ ప్రాంతంలో ముందు జాగ్రత్తగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్రమ కట్టడాన్ని మాత్రమే తొలగించాం

ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా కట్టడం ప్రారంభించేటప్పుడే అనేకమార్లు చెప్పినప్పటికీ కట్టడం నిర్మించారని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించవలసిన స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాన్ని తొలగించామని కమిషనర్ వివరించారు.

దయచేసి రాజకీయం చేయొద్దు

విశాలమైన ప్రభుత్వ స్థలంలో స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పేద ప్రజలకు ఉపయోగపడేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు ఆ స్థలాన్ని గుర్తించినట్లు స్థానిక కౌన్సిలర్ బండారు గంగమ్మ తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడవలసిన స్థలంలో దయచేసి కుల,మతాల చిచ్చు పెట్టవద్దని పలు రాజకీయ పార్టీల నాయకులకు హితవు పలికారు. ప్రస్తుతం కాలనీలో అందరం కలసి మెలసి ఉంటున్నామని, ఈ ఘటనను రాజకీయం చేయవద్దని అన్నారు.

కూల్చిన భవనం వద్ద శిల ఏర్పాటు

మున్సిపల్ అధికారులు తొలగించిన నిర్మాణం వద్ద కొందరు స్థానికులు హడావిడిగా ఓ శిల ఏర్పాటు చేసి పూజలు ప్రారంభించారు. శనివారం సాయంత్రం పాల పొంగళ్లు పొంగించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పోలీస్ పహారా కొనసాగుతోంది.

పద్మశాలీ కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించండి

డీఆర్‌వోకు ప్రభుత్వ విప్ ఉదయభాను వినతి


డీఆర్‌వోను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, పద్మశాలీ సంఘం నేతలు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేటలో పద్మశాలీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కోరారు. ఈ సందర్భంగా శనివారం జగ్గయ్యపేట శ్రీపద్మశాలీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే ఉదయభానుతో కలిసి విజయవాడ కలెక్టర్ వారి కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) కె.మోహన్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలో 10 వేల మంది పైన పద్మశాలీయుల జనాభా ఉన్నారని, కమ్యూనిటీ భవనం కోసం పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని పద్మశాలీ కులానికి కేటాయించాలని పద్మశాలీ కుల ముఖ్యులు ఎమ్మెల్యే ఉదయభాను ద్వారా డీఆర్‌వో కె.మోహన్‌కుమార్‌కి వివరించినట్లు తెలిపారు. డీఆర్‌వో సానుకూలంగా స్పందించి జగ్గయ్యపేట మండల తహసీల్దార్ వారికి మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. డీఆర్‌వోను కలిసిన వారిలో పేట పట్టణ శ్రీ పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు అల్లి రవిచంద్, ప్రతినిధులు మెటికల శ్రీనివాసరావు, మునిని శివ ఉన్నారని తెలిపారు.

పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పెంటి శ్రీనివాసరావు

జగ్గయ్యపేటఅర్బన్: మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని జైహింద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఉక్కు కళావేదికలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ వారి ద్వారా జగ్గయ్యపేటలో మహిళలు, ఔత్సాహికులకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, మార్కెటింగ్, ఆర్థిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు రుణాలను పొందే మార్గాలను వివరించారు. ముఖ్యంగా మహిళలు వారి స్వశక్తిపై ఆధారపడే విధంగా పలు పథకాలను వివరించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ఉషారాణి, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, చార్టెడ్ అకౌంటెంట్ కిరణ్, ఏఎంసీ డైరెక్టర్ గోలి రామేశ్వరి, రాజ్యలక్ష్మి, నాగమణి తదితర మహిళలు పాల్గొన్నారు.

జయహో! జగజ్జనని


దుర్గగుడిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జయహో జగజ్జనని అంటూ భక్తజనం కనకదుర్గమ్మను కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించారు. రెండో శనివారం, ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి పెరిగింది. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టగా, రద్దీ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇన్‌చార్జ్ ఈవో కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్జిత సేవల్లో ఉభయదాతలు

అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మరో వైపున ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ. 300,రూ. 500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ నేపథ్యంలో అమ్మవారికి భక్తులు సమర్పించే చీరల కౌంటర్‌ను చైర్మన్ కర్నాటి రాంబాబు తనిఖీ చేశారు. భక్తులు ఇచ్చిన ప్రతి చీరకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

ద్వాక్రా మహిళలకు జగనన్న నజరానా

- పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ పథకం
- నియోజకవర్గంలో 3,762 గ్రూపులకు లబ్ధి
- ఖాతాల్లో జమ అయిన మొత్తం రూ.4,78,82,000


పెనుగంచిప్రోలులో గాజుల దుకాణం నిర్వహిస్తున్న ద్వాక్రా మహిళ (ఫైల్)

పెనుగంచిప్రోలు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలకు వరుసగా నాలుగో సంవత్సరం కూడా సున్నా వడ్డీ సాయం అందించింది. ద్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలపై బ్యాంక్‌లు వసూలు చేస్తున్న వడ్డీ మొత్తాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీ పథకం ద్వారా మహిళల ఖాతాలో జమ చేశారు. కరోనా మహమ్మారితో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జగనన్న కానుక పక్కాగా అమలవుతోందని మహిళలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పథకం అమలు ఇలా...

స్వయం సహాయక సంఘాలు బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలు 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31వ తేదీ మధ్యలో గరిష్టంగా రూ.3 లక్షల వరకు కట్టిన సంఘాలకు వడ్డీని వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా ప్రభుత్వం తిరిగి సభ్యుల ఖాతాకు నేరుగా జమ చేసింది. సక్రమంగా బకాయిలు తిరిగి చెల్లిస్తున్న

మండలం	గ్రూపులు	జమ చేసిన మొత్తం
జగ్గయ్యపేట	1411	రూ.1,92,00000
పెనుగంచిప్రోలు	1082	రూ.1,35,58,000
వత్సవాయి	1269	రూ.1,51,24,000

మాట ఇస్తే తప్పని ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను తప్పక నెరవేరుస్తున్నారు. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలను మోసం చేస్తే జగనన్న ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వరుసగా నాలుగో ఏడాది కూడా సున్నా వడ్డీ కింద మహిళల ఖాతాలో నగదు జమ చేసింది.

బి.సుజాత, డ్వాక్రా మహిళ

క్రమం తప్పకుండా కడితే వడ్డీ జమ



తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా కట్టటంతో వారికి సున్నా వడ్డీ వర్తిస్తోంది. సున్నా వడ్డీ పథకంతో మహిళా సంఘాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి. బ్యాంక్ లింకేజీలతో వారి జీవనోపాధి మెరుగు పరుచుకుంటున్నారు. చిరు వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు.

కాకాని పద్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు

జాతీయ పతాకాల పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రివర్ణ జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగుర వేయాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా పోస్టల్ శాఖ చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ జాతీయ భావాన్ని పెంపొందించే విధంగా పోస్టల్ శాఖ దేశ వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. పోస్టల్ యూనియన్ నాయకులు వసంతరావు, పోస్టు మాస్టర్ రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

నజీరా మృతి బాధాకరం



నందిగామటౌన్: ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చిన తల్లి షేక్ నజీరా మృతి బాధాకరమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో ఇటీవల ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన నజీరా కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని పథకాలను సత్వరమే అందించాలని అధికారులను ఆదేశించారు. భర్త ఖాశీం, కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించి ధైర్యం చెప్పారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షుడు షేక్ కరిముల్లా సౌజన్యంతో అందజేసిన రూ.50 వేల ఆర్థిక సహకారాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాగంటి రవికిరణ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశాలు

జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 19, 20 తేదీల్లో విజయవాడలో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్లీనరీ కరపత్రాలను విడుదల చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు కె.రాజు, మండల నాయకులు భరత్, ప్రదీప్, వంశీ, కమల్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ ప్రాంతంలో భారీ వర్షం

నందిగామ: నందిగామ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం భానుడు భగభగలాడాడు. మధ్యాహ్నం 1:45 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై సుమారు గంట సేపు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా ఎండలతో తల్లడిల్లిన ప్రజలు ఈ వర్షంతో సేద తీరారు. ఇదిలా ఉండగా ఈ వర్షం పంట పొలాలకు కూడా ఎంతో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 16న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు 1998 డీఎస్సీ పోస్టుల సాధన పోరాట కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించి 4072 మందికి ఓపెన్ మెరిట్ పద్ధతిలో పోస్టులు కేటాయించారన్నారు. మిగిలిన వారందరికీ కూడా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. డీఎస్సీ-98 అభ్యర్థులకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మద్దతిస్తారన్నారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, పాదిలి రమణ, రమేష్,రత్నం తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

ముస్లిం, క్రైస్తవుల శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ పాస్టర్లు, వివిధ పార్టీల నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: మణిపూర్, హర్యానా రాష్ట్రాల్లో జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని పలువురు ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ పాస్టర్లు డిమాండ్ చేశారు. మణిపూర్, హర్యానా రాష్ట్రాల్లో జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణంలో శనివారం సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడదాం, లౌకిక రాజ్యాన్ని స్థాపిద్దాం అంటూ నినాదాలతో క్రైస్తవ, ముస్లిం, మైనార్టీ సంఘాల ఐక్య వేదిక(జేఏసీ) ఆధ్వర్యంలో ముస్లింలు, క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్‌జీఎస్ కళాశాల నుంచి మొదలైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగింది. మణిపూర్, హర్యానా రాష్ట్రాల్లో క్రైస్తవులపై, ముస్లింలపై ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్, హర్యానాలలో అఘాయిత్యాలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కూల్చిన ఇళ్లను, చర్చిలను, మసీదులను పునర్నిర్మించాలని కోరారు. అన్ని మతాలను గౌరవిస్తూ భారత రాజ్యాంగంలో సెక్యులరిజాన్ని పరిరక్షించాలని కోరారు. ముస్లిం ముఫ్తీలు, ఆలీంలు, హఫీజ్‌లు, క్రైస్తవ పాస్టర్లు, విశ్వాసులు, అన్ని రాజకీయ పార్టీల ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎగరాలి..ఎగరాలి మువ్వన్నెల జెండా


వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న సామినేని వెంకట కృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేటఅర్బన్: దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలకు చాటి చెప్పాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో భారత తపాలా శాఖ వారితో కలిసి కృష్ణ ప్రసాద్ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి జాతీయ భావాన్ని చాటి చెప్పాలన్నారు. తపాలా శాఖ(పోస్టల్) కార్యాలయంలో రూ.25 చెల్లించి జాతీయ పతాకాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం తపాలా శాఖ ద్వారా 100 జెండాలను కొనుగోలు చేసి రాజన్న ఉచిత భోజనం కార్యక్రమం వద్ద ప్రజలకు ఉచితంగా అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, నాయకులు పాటి సాంబ, డ్రిల్లింగ్ ఖాజా, పోస్టల్ యూనియన్ నాయకులు పీవీ వసంతరావు, జగ్గయ్యపేట పోస్టు మాస్టర్ రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా తయారు

తహసీల్దార్ శంకరబాబు


ఓటరు జాబితా ధ్రువీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బూత్ లెవెల్ అధికారి వెంకటేశ్వరరావు

కంచికచర్ల: ఓటరు జాబితా ధ్రువీకరణ కార్యక్రమానికి గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు విజ్ఞప్తిచేశారు. మండల కేంద్రమైన కంచికచర్ల, మండలంలోని గండేపల్లి, కీసర, వేములపల్లి, గొట్టుముక్కల, మొగులూరు, పరిటాల తదితర గ్రామాల్లో శనివారం ఓటరు జాబితా ధ్రువీకరణ కార్యక్రమాన్ని బీఎల్ఓలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపడుతున్నాయని అన్నారు. ముఖ్యంగా యువతను గుర్తించి ఓటు హక్కు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అందరి సహకారంతో నాణ్యమైన మెరుగైన ఓటరు లిస్టును తయారు చేస్తామన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించుకుందాం

కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘ జాతీయ సమావేశంలో ఎంపీ బినయ్ బిశ్వం



కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంఘ జాతీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బినయ్ బిశ్వం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పార్లమెంటు సభ్యులు బినయ్ బిశ్వం అన్నారు. విజయవాడలో మూడు రోజుల పాటు జరగనున్న కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ 26వ సర్వసభ్య సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. పోరాటాల పురిటిగడ్డ విజయవాడలో 1974లో సమావేశాలు జరగ్గా, 49 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు జరుగుతున్నట్లు ఆ సంఘ కేంద్రకమిటీ అధ్యక్షులు ఎంఎస్ శ్రీనివాసన్ తెలిపారు. సమావేశాల్లో ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం, కార్యదర్శి బీఎస్ రాంబాబుతో పాటు కెనరాబ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సత్యనారాయణ రాజు, జనరల్ మేనేజర్ పి రవివర్మ, ఉపాధ్యక్షుడు జెపీ శర్మ, కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీకృష్ణ పాల్గొన్నారు.

గద్దర్ మరణం ప్రజాఉద్యమాలకు తీరని లోటు

సంస్మరణ సభలో వక్తలు


గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా యుద్ధనౌకగా పేరొందిన గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యాన రచయిత, కళాకారుడు, వాగ్గేయకారుడు గుమ్మడి విఠల్ రావు (గద్దర్)సంస్మరణ సభ జరిగింది. తొలుత గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు గద్దర్ పాటలు పాడి నివాళులర్పించారు. ఏఎస్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ గద్దర్ జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారన్నారు. సంస్మరణ సభలో తంగిరాల సోనీ (బహుజన రచయితల వేదిక), మోతుకూరి అరుణ్‌కుమార్ (అరసం) పేరూరి మురళి కుమార్, ఎస్.ఎస్.సి బోస్ (పౌర హక్కుల సంఘం), కవి శిఖా ఆకాష్, మల్లెల వెంకట్రావు, పంతగాని రమేష్ (ఏబీఎస్ పార్టీ), కృష్ణ (దళిత మహాసభ) కొరబండి బాబూరావు, ఆర్.పిచ్చయ్య, ఆంధ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.